

ముహూర్తమెప్పుడో!
జైపూర్ ఎస్టీపీపీలో మూడో యూనిట్ ప్లాంట్ నిర్మాణం టెండర్ల దశలోనే నిలిచింది. పనుల ప్రారంభోత్సవానికి ముహూర్తం కలిసి రావడం లేదు.
8లో ▸



అన్నదాత అరిగోస
కాడెడ్ల స్థానంలో ట్రాక్టర్లు, పవర్‌టిల్లర్ల వినియోగం పెరిగింది. సాగులో యంత్రాల వినియోగం పెరగడంతో పెట్టుబడి ఖర్చులు అధికమవుతున్నాయి.
9లో ▸

గరిష్టం/కనిష్టం
37.4 /27.1

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉపరితల ఆవర్తనం, రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురిసే అవకాశం ఉంది.

స్తంభం వాడితే ట్యాక్స్!

- కేబుల్ టీవీ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లకు ఆదేశాలు
- ఇకపై ప్రతినెలా తప్పనిసరిగా పన్నులు చెల్లించాల్సిందే..
- విద్యుత్ శాఖ నిర్ణయం
- ఆర్థిక భారమవుతుందని ఆపరేటర్లు, ప్రొవైడర్ల ఆవేదన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆపరేటర్లు

సాక్షి, ఆసిఫాబాద్: కేబుల్ టీవీ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు ఉచితంగా విద్యుత్ స్తంభాలను వినియోగించుకోవడం ఇకపై వీలుపడదు. గతంలో మాదిరిగా పన్నులు చెల్లించకుండా పోల్స్‌పై కేబుళ్ల ఏర్పాటు చేస్తామంటే కుదరదని విద్యుత్‌శాఖ స్పష్టం చేసింది. స్తంభాలు ఎవరూ వాడినా ప్రతినెలా పన్నులు చెల్లించాలంటూ సర్క్యులర్ జారీ చేసింది. గతం నుంచే ఈ పన్నుల విధానం ఉన్నా కేవలం కొంతమంది మాత్రమే పన్నులు చెల్లిస్తున్నారని, క్షేత్రస్థాయిలో విద్యుత్ స్తంభాలను వాడుకుంటున్న కేబుల్, ఇంటర్నెట్ ప్రొవైడర్ల వివరాలు మరోసారి సేకరించాలని ఆ శాఖ అధికారులు నిర్ణయించారు.

15 రోజుల్లో సరిచేయాలి

గ్రామాలు, పట్టణాల్లో విద్యుత్ స్తంభాలపై చిక్కుముళ్లతో కనిపించే కేబుల్ టీవీ, ఇంటర్నెట్ తీగలను 15 రోజుల్లోగా సరిచేయాలని విద్యుత్ అధికారులు ఆదేశించారు. లేకుంటే కేబుల్ టీవీ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. కనెక్షన్లు లేకపోయినా విద్యుత్ తీగలతోపాటు కలిసిపోయిన కేబుల్, ఇంటర్నెట్ కేబుళ్లను తక్షణమే తొలగించాలని ఆ శాఖ నిర్ణయించింది. చాలామంది ఆపరేటర్లు తమ కనెక్షన్లను ఇతరులకు విక్రయించారు. వాటిని కొనుగోలు చేసిన కొత్త ఆపరేటర్లు మాత్రం విద్యుత్ శాఖకు ఎలాంటి పన్నులు చెల్లించకుండా స్తంభాలను వినియోగించుకుంటున్నారు.

ఎన్ని స్తంభాలు వాడుతున్నారు..?

విద్యుత్ శాఖ జారీ చేసిన పోల్‌ట్యాక్స్ సర్క్యులర్‌లో ప్రైవేటు వ్యక్తులు గ్రామాల్లో కరెంట్ స్తంభాలను వినియోగిస్తే నెలకు రూ.15, పట్టణాల్లో అయితే రూ.20 చెల్లించాలని ఆదేశించారు. ఈ విధానం చాలా రోజుల నుంచే అమల్లో ఉంది. కానీ కొందరు ఆపరేటర్లు మాత్రమే అరకొరగా పన్నులు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పదిరోజుల్లోగా జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో టీవీ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు ఎన్ని కరెంట్ స్తంభాలను వాడుతున్నారో సర్వే చేయాలని అధికారులు నిర్ణయించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆసిఫాబాద్‌అర్బన్: పోల్‌టాక్స్ విధానాన్ని రద్దు చేయాలని కేబుల్ టీవీ, ఇంటర్నెట్ ఆపరేటర్ల సంఘం ముఖ్య సలహాదారుడు, ఐఎస్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు లోకేశ్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట మంగళవారం కేబుల్ టీవీ, ఇంటర్నెట్ ఆపరేటర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్పొరేట్ వ్యవస్థలో కేబుల్ ఆపరేటర్లు అప్పుల పాలవుతున్నారని, నూతన పాలసీలతో ఆర్థికంగా నష్టపోతారని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కేబుల్ టీవి, ఇంటర్నెట్ ఆపరేటర్ల సంఘం సలహాదారుడు మనోహర్, కన్వీనర్ సాజిద్, కోకన్వీనర్ అశోక్‌గౌడ్, సభ్యులు సత్యనారాయణ, దిలీప్, కిరణ్, స్వప్న, జమీల్, సంపత్, సాయికృష్ణ, నగేశ్‌చారి, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో విద్యుత్ స్తంభానికి అమర్చిన కేబుల్ టీవీ, ఇంటర్నెట్ వైర్లు

వదిలేస్తే కుదరదు..

కేబుల్ టీవీ, ఇంటర్నెట్ ప్రొవైడర్లు తమ కేబుల్ వైర్లను క్రమపద్ధతిలో అమర్చుకోవాలి. ఇష్టం వచ్చినట్లు వదిలేస్తామంటే కుదరదు. అలాంటి వైర్లను తొలగిస్తాం. స్తంభం చుట్టూ చిక్కుముళ్లతో తీగలు ఉండటంతో మరమ్మతుల సమయంలో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కరెంట్ స్తంభాలు ప్రైవేటు వ్యక్తులు వాడితే పన్నులు చెల్లించాల్సిందే.

– శేషారావు, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ, ఆసిఫాబాద్

పోల్‌ట్యాక్స్ రద్దు చేయాలి



విద్యుత్ శాఖ ఇటీవల జారీ చేసిన పోల్‌ట్యాక్స్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలి. జిల్లావ్యాప్తంగా కొన్నేళ్లుగా దాదాపు 60 మంది కేబుల్ ఆపరేటర్లు ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. స్తంభాలపై వైర్లను సర్దిపెట్టడానికి సమయం ఇవ్వాలి. మమ్మల్ని కేటగిరీ– 1 కింద గుర్తించాలి.

– ఇంతియాజ్ అహ్మద్, కన్వీనర్, కేబుల్ టీవీ– ఇంటర్నెట్ ఆపరేటర్ల యూనియన్

భారం సరికాదు



ప్రస్తుతం సాంకేతికతతో కేబుల్ టీవీ కనెక్షన్లు పూర్తిగా తగ్గిపోయాయి. గ్రామీణ స్థాయిలో కూడా ఇంటర్నెట్ వాడకం పెరగడం, స్మార్ట్‌ఫోన్ల వినియోగంతోపాటు కార్పొరేట్ సంస్థల నుంచి పోటీ ఉండడంతో కేబుల్ ఆపరేటర్లపై భారం పడుతోంది. ఈ తరుణంలో ప్రభుత్వం కేబుల్ ఆపరేటర్లపై పోల్‌ట్యాక్స్ అంటూ మరోభారం వేయడం సరికాదు.

– జంగోని అశోక్‌గౌడ్, జిల్లా కేబుల్ ఆపరేటర్ల సంఘం కోకన్వీనర్

తాగు, సాగునీటి వనరులు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సంయుక్త కార్యదర్శి వినోద్, పక్కన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని తాగు, సాగునీటి వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కేంద్ర పెట్రోలియం, సహజ వనరులు, గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి నీటిపారుదల, మిషన్ భగీరథ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సాగునీటి వనరుల రక్షణ, నీటి వినియోగం, తాగునీటి వనరుల ద్వారా ఇంటింటికీ నీరు అందించడం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు శుద్ధమైన జలం సరఫరా చేయడం అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సాగు భూములకు చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించి వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సాగునీటి వనరుల్లో మత్స్య సంపదను పెంపొందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు శుద్ధమైన జలం అందించాలన్నారు. ప్రతీ వర్షపు నీటిబొట్టును నిల్వ చేయాలని సూచించారు. జగన్నాథపూర్ ప్రాజెక్టు పెండింగ్ పనులపై నీటిపారుదల శాఖ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. నివేదిక రూపొందించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో ఒక భారీ నీటిపారుదల ప్రాజెక్టు, మూడు మధ్యతరహా ప్రాజెక్టులు, 574 చెరువులు, కుంటలు, 13 లిఫ్ట్ ఇరిగేషన్‌ల ద్వారా సాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నీటి సంరక్షణకు ట్యాంకులు, ఫారంపాండ్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అంతకుముందు కేంద్ర బృంద సభ్యులు గుండి గ్రామాన్ని సందర్శించారు. సమావేశంలో కేంద్ర బృందం సభ్యులు, నీటిపారుదల శాఖ అధికారులు గుణవంత్‌రావు, ప్రభాకర్, మిషన్ భగీరథ అధికారి సిద్దిఖీ, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నిరుద్యోగులకు అవగాహన



మాట్లాడుతున్న జీఎం గిరి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు హెచ్‌ఆర్డీ భవనంలో మంగళవారం భారతీయ యువశక్తి ట్రస్టు ఆధ్వర్యంలో నిరుద్యోగులు, యువకులకు బిజినెస్‌పై అవగాహన కల్పించారు. ఎస్పీఎం జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి మాట్లాడుతూ వ్యాపార రంగంలో ఏ విధంగా ముందుకెళ్లాలి, మార్కెట్‌లో ప్రొడక్టును ఎలా పరిచయం చేయాలో వివరించారు. కార్యక్రమంలో బీవైఎస్‌టీ క్లస్టర్ మేనేజర్ ప్రబీర్, అశోక్ కునల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు లక్ష్మీనరసింహ, ఐకేపీ డీఎంవో మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

కాగజ్‌నగర్‌రూరల్: భూ సమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఎం.డేవిడ్ తెలిపారు. కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును సందర్శించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయి విచారణ అనంతరం శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. అలాగే దుర్గానగర్‌లో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సును పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ మధుకర్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: హకీంపేట్ క్రీడాపాఠశాలలో 2025– 26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, యువజన క్రీడల అధికారి రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 16 నుంచి 19 వరకు మండల స్థాయి ఎంపిక పోటీలు, ఈ నెల 23 నుంచి 26 వరకు జిల్లా స్థాయి, జూలై 1 నుంచి 5 వరకు రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2016 సెప్టెంబర్ 1 నుంచి 2017 ఆగస్టు 30 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు.

బడీడు పిల్లలు స్కూళ్లలో ఉండాలి



మాట్లాడుతున్న డీడీ రమాదేవి

కెరమెరి(ఆసిఫాబాద్): బడీడు పిల్లలు స్కూళ్లలో ఉండాలని, ఆ దిశగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ పి.రమాదేవి అన్నారు. మండలంలోని అంబరావుగూడ గ్రామంలో మంగళవారం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులతో మాట్లాడారు. చదువుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థుల బాగోగుల కోసం చర్యలు చేపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపించొద్దని సూచించారు. చదివే వయస్సులో చిన్నారులను వ్యవసాయ పనులకు పంపించొద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దాము తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

ఆసిఫాబాద్‌రూరల్: ఫైర్ సెక్యూరిటీ లేని పాఠశాలలు, ఇండస్ట్రీలు, షాపింగ్ కాంప్లెక్స్‌లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఫైర్ అధికారికి వినతిపత్రం అందించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ జిల్లాలోని ఇండస్ట్రీలు, షాపింగ్ మాల్స్, ప్రైవేట్ పాఠశాలల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం లేదన్నారు. దీంతో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టీకానంద్, నాయకులు పాల్గొన్నారు.

ఏ శాఖ ఇస్తరో..!

- మంత్రి వివేక్‌కు పోర్ట్‌ఫోలియోపై చర్చ
- కేటాయింపుపై కొనసాగుతున్న కసరత్తు
- ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా అవకాశం

గత ఏడాదిన్నరగా ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర మంత్రిమండలిలో ప్రాతినిధ్యం లేక ప్రజలు, నాయకులు, అధికారులకు పరిపాలనలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. తాజాగా చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రివర్గంలో చోటు దక్కడం ఊరటనిచ్చింది. మరోవైపు రాష్ట్రం ఏర్పడ్డాక, తూర్పు జిల్లా నుంచి తొలిసారిగా మంత్రి పదవి లభించింది. గత ప్రభుత్వంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం ఉండగా.. ఈసారి మంచిర్యాల జిల్లాకు అవకాశం లభించింది.



మంగళవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పరిపాలన తదితరవన్నీ జిల్లాకు మంత్రి లేకపోవడంతో జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం అన్ని పథకాల అమలులో ఇన్‌చార్జి మంత్రి కీలకంగా మారారు. ప్రస్తుతం మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొనసాగుతున్నారు. జిల్లాల వారీగా జరుగుతున్న అభివృద్ధి, పథకాల అమలుపై సమీక్షలు, సమావేశాలు, నియోజకవర్గాల వారీగా పర్యటనలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి ఇకపై వివేక్ ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. దీంతో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పర్యవేక్షణలో సులువు కానుంది. ప్రభుత్వ పరంగా వేడుకలు, అధికారిక కార్యక్రమాలు మంత్రి హోదాలో జరగనున్నాయి.

శాఖలపై కసరత్తు

రెండో విడతలో మంత్రులుగా ముగ్గురు ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్ ప్రమాణం స్వీకారం చేశారు. వీరికి ఇంకా శాఖలు కేటాయించలేదు. మంత్రి మండలిలో ఖాళీగా హోం, మున్సిపల్, గనులు, కార్మిక, పశుసంవర్ధక, పాడి, సంక్షేమ శాఖలు, ఇతర శాఖలు ఖాళీగా ఉండడంతోపాటు రెండేసి, మూడేసి శాఖలు నిర్వహిస్తున్న మంత్రులు ఉన్నారు. ఈ క్రమంలో కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న వారికి ఎవరికి ఏ శాఖ ఇస్తారోనని ఆసక్తి నెలకొంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దీనిపై కసరత్తు చేస్తుండగా, త్వరలోనే స్పష్టత రానుంది.

వివేక్‌పైనే ఆశలు

గత పదిహేడు నెలలుగా ఉమ్మడి జిల్లా నుంచి మంత్రిగా లేకపోవడంతో నాయకులతోపాటు ప్రజలకు లోటు ఏర్పడింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో నలుగురిలో ఒకరికైనా మంత్రి పదవి వస్తుందని ముందు నుంచి ప్రచారం ఉంది. పలుమార్లు వాయిదా పడ్డాయి. తాజాగా వివేక్‌నే ఖరారు చేయడంతో ఆయనపై ఉమ్మడి జిల్లా వాసుల ఆశలు ఉన్నాయి. నిధులు, విధులు, బడ్జెట్ కేటాయింపులు, ఖర్చు తదితరవన్నీ ఉమ్మడి జిల్లా నుంచి బలంగా వినిపించాల్సి ఉంటుంది. తన నియోజకవర్గం చెన్నూరుతోపాటు మిగతా ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాల్సి ఉంది. విద్య, వైద్యం, ఆరోగ్యం, గిరిజన ప్రాంతాలు, సింగరేణి తదితర అనేక సమస్యలు ఉన్నాయి.

సీఎంను కలిసిన మంత్రి, ఎంపీ

చెన్నూర్: రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంగళవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రిగా అవకాశం కల్పించిన అధిష్టానానికి ధన్యవాదాలు తెలియజేశారు.

భవిష్యత్తుకు బాట

- ప్రారంభమైన 'అమ్మ మాట– అంగన్‌వాడీ బాట'
- అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచేందుకు చర్యలు
- ఈ నెల 17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు



తిర్యాణి మండలం సుంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చేరిన చిన్నారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు అందించేలా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి ఆరోగ్యం, ఆటపాటలతో కూడిన సృజనాత్మక విద్యనందించడమే లక్ష్యంగా 'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని ప్రారంభించింది. తల్లిదండ్రులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామపెద్దలను భాగస్వాములను చేస్తూ ఈ నెల 17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బడీడు పిల్లల కోసం బడిబాట కార్యక్రమం నిర్వహిస్తుండగా, గతేడాది నుంచి 2.5 నుంచి ఆరేళ్ల లోపు చిన్నారుల కోసం అంగన్‌వాడీ బాట కార్యక్రమం చేపడుతున్నారు. గత సంవత్సరం నిర్వహించిన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇవ్వడంతో ఈ ఏడాది సైతం ఐసీడీఎస్ సిబ్బంది ఉత్సాహంతో కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఆటపాటలతో విద్యాబోధన

జిల్లాలోని ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 973 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా, ఆరేళ్లలోపు చిన్నారులు 44,702 మంది ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసి వాటి ద్వారా చిన్నారులకు ప్రీప్రైమరీ విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా గోడలకు రంగురంగులతో బొమ్మలు వేయించి పిల్లలను ఆకర్షించేలా కేంద్రాలను తీర్చిదిద్దారు. ఇక అమ్మ మాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమాల ద్వారా గ్రామాల్లోని రెండున్నర ఏళ్ల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశం కల్పిస్తున్నారు. చిన్నారులకు బయటి ప్రపంచం గుర్తుకు రాకుండా ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయనున్నారు. సృజనాత్మకతను పెంచే రీతిలో కేంద్రాలకు గత సంవత్సరమే ప్లే మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఊయల, జారుడుబల్ల వంటి ఆట వస్తువులతోపాటు అక్షరాలు, అంకెలు, బొమ్మలతో కూడిన సామగ్రితో విద్యనందించేలా టీచర్లకు సైతం తర్ఫీదు ఇచ్చారు. పసి వయస్సులో ఎలాంటి ఒత్తిడి లేకుండా స్నేహపూర్వక వాతావరణం కల్పించడంతోపాటు వారి ఆరోగ్య రక్షణకు పౌష్టికాహారం అందిస్తున్నారు. దీంతో 3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులను ప్రైవేటు ప్లేస్కూల్స్‌కు కాకుండా తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

జిల్లాలోని అన్ని మండలాల్లో మంగళవారం నుంచి అమ్మ మాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమాలు మొదలయ్యాయి. కేంద్రాలను అలంకరించడం మొదలు, చిన్నారుల గుర్తించడం, కేంద్రాల్లో చేర్పించడం, సేవల గురించి తల్లిదండ్రులకు వివరించడం తదితర కార్యక్రమాలు ఈ నెల 17 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నారు. మొదటిరోజు అంగన్‌వాడీ కేంద్రాలను అలంకరించి తల్లిదండ్రులు, చిన్నారులను కేంద్రాలకు ఆహ్వానించి వారు సెల్ఫీలు తీసుకునేలా ప్రోత్సహించారు.

- బుధవారం గ్రామంలో మూడేళ్లలోపు చిన్నారులను గుర్తించి వారి ఇళ్లను సందర్శించడం, తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాలు, ప్రీస్కూల్, పాఠ్యపుస్తకాలు, టైం టేబుల్, కథల పుస్తకాలు, ప్రీస్కూల్ కిట్, స్కూల్ రెడినెస్ యాక్టివిటీస్, అభివృద్ధి కార్డులు, ప్రగతిపై సమాచారం అందించడం ఒక వైపు అయితే గుర్తించిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం, ప్రీస్కూల్ పూర్తి చేసిన పిల్లలకు సర్టిఫికెట్లు అందించడం (గ్యాడ్యుయేషన్ డే), 5 సంవత్సరాలు పైబడిన పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడం,
- 12, 13, 16వ తేదీల్లో పోషణ్ వంటశాల తోటలు అభివృద్ధి చేయడం, టీహెచ్‌ఆర్, హెచ్‌సీఎం ద్వారా అందిస్తున్న పోషకాహార పద్ధతులను హైలెట్ చేయడం, పిల్లలందరికీ అనుకూల వాతావరణాన్ని కల్పించడం,
- 17న సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాల నిర్వహణ, ప్రీస్కూల్ టైం టేబుల్, పాఠ్యాంశాలు, మంచి అలవాట్లు, ప్రీస్కూల్ విద్య ప్రాముఖ్యతను సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో ప్రదర్శన, ప్రీస్కూల్ పుస్తకాలు, అసెస్మెంట్ కార్డుల ప్రదర్శన, తల్లిదండ్రులు, సమాజ సభ్యులు, గ్రామస్తులను అతిథులుగా ఆహ్వానించడం, తల్లిదండ్రులకు బాల్య దశలో సంరక్షణ, విద్య గురించి అవగాహన కల్పించడం, ప్రీస్కూల్ పిల్లలు తయారుచేసిన బోధన సామగ్రి, అంగన్‌వాడీ టీచర్, ఐసీడీఎస్ అందించిన మెటీరియల్స్ ప్రదర్శించడం, ఆరోగ్యంగా ఉన్న పిల్లలను నిత్యం ప్రీస్కూల్‌కు పంపుతున్న తల్లిదండ్రులకు బహుమతులు అందించడం, సామూహిక అక్షరభ్యాస కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆటపాటలతో కూడిన విద్య



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఓ వైపు ఆరోగ్యం, మరోవైపు ఆటపాటలతో కూడిన విద్య అందుతోంది. ప్రీస్కూల్ కార్యక్రమాల ద్వారా చిన్నారులకు చదువుపై ఇష్టం పెరిగి పాఠశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతారు. అందుకు అనుగుణంగా గ్రామాల్లోని చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం, ప్రీస్కూల్‌పై చిన్నారులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, సామూహిక అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలను అంగన్‌వాడీ బాట ద్వారా చేపడుతున్నాం.

– భాస్కర్, జిల్లా శిశుసంక్షేమాధికారి

ఉరుములతో భారీ వర్షం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములతో భారీ వర్షం కురిసింది. పలు కాలనీల్లో చెట్లు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. పెట్రోల్ పంప్ ఏరియాలో ఈదురు గాలులకు చెట్లు విరిగి ఆటోపై పడ్డాయి. ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పట్టణవ్యాప్తంగా పలు కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



అంధకారంలో ద్వారకానగర్ కాలనీ

విత్తన దుకాణాల్లో తనిఖీలు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఓ ఇంట్లో నిల్వ ఉంచిన సుమారు రూ.5లక్షల విలువైన పత్తివిత్తనాల ప్యాకెట్లు పట్టుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఏవో మనీషాను 'సాక్షి' సంప్రదించగా.. అక్రమంగా నిల్వ ఉంచిన విత్తనాలను పట్టుకున్నామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

అప్పు చెల్లించనందుకు కట్టేసి కొట్టారు

భీమిని: కన్నెపల్లి మండలంలోని నాయకునిపేట గ్రామపంచాయతీకి చెందిన హన్మంత్‌పై అదే గ్రామానికి చెందిన జింకమోర్ల నానయ్య కుటుంబసభ్యులతో కలిసి దాడి చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హన్మంత్ అదే గ్రామానికి చెందిన జింకమోర్ల నానయ్య వద్ద రూ.2.30లక్షలు అప్పుగా తీసుకున్నాడు. హన్మంత్ సోమవారం రాత్రి నాయకునిపేట వద్ద బస్సు దిగి ఇంటికి వెళ్తున్న సమయంలో నానయ్య బైక్‌పై వచ్చి అప్పు ఎప్పుడు చెల్లిస్తావని అతడి కుమారుడు హరీశ్‌తో కలిసి దాడికి పాల్పడ్డాడు. హన్మంత్‌ను బైక్‌పై ఇంటికి తీసుకువెళ్లి తాడుతో గుంజకు కట్టేసి కుటుంబ సభ్యులైన లక్ష్మి, శ్రీమతి, బిక్కయ్యతో కలిసి దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా పట్టివేత

భీమారం: మండల కేంద్రం సమీపంలోని కొత్తగూడెంలో మంగళవారం నెన్నెల మండలం కొత్తూరుకు చెందిన భద్రునాయక్ వద్ద 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. ఆవిడం–భీమారం ప్రధాన రోడ్డులో కొత్తగూడెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా భద్రునాయక్ అనుమానాస్పద స్థితిలో కనిపించగా అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అతడి వద్ద ఉన్న సంచి తనిఖీ చేయగా గుడుంబా ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. నెన్నెల మండలం కొత్తూరు ప్రాంతం నుంచి భీమారానికి అతడు గుడుంబా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–నిర్మల్ హైవేపై కద్దా హోటల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరుకు చెందిన షేక్ అహ్మద్ మంగళవారం బైక్‌పై వస్తుండగా, ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. దీంతో షేక్ అహ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని చికిత్స నిమిత్తం స్థానికులు పట్టణంలోని ఏరియాస్పత్రికి తరలించారు.

గుడుంబా విక్రేతకు జరిమానా

గుడిహత్నూర్: మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన ఘులే శివాజీ గతంలో పలుసార్లు గుడుంబా విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు దొరికాడు. దీంతో తహసీల్దార్ ఎదుట అతడిని బైండోవర్ చేశారు. అయినప్పటికీ మళ్లీ గుడుంబా విక్రయిస్తూ దొరికిపోయాడు. దీంతో ఎక్సైజ్ అధికారులు అతడికి రూ.50 వేల జరిమానా విధించారు. మంగళవారం శివాజీ జరిమానా చెల్లించి దాని ప్రతిని ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు అందజేశాడు.

సాలెవాడలో ఉద్రిక్తత

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ గ్రామంలో ప్రేమజంట కారణంగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గ్రామంలోని ఓ వర్గానికి చెందిన అమ్మాయి మరోవర్గానికి చెందిన అబ్బాయి ప్రేమించుకున్నారు. వారి ప్రేమను పెద్దలు అంగీకరించలేదు. దీంతో వారు సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఈక్రమంలో యువతి కుటుంబ సభ్యులు అబ్బాయి ఇంటి రేకులు కూలగొట్టి సామగ్రి తొలగించారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించగా సీఐ మొగిలి, ఎస్సై మనోహర్, ఏఎస్సై రాములు గ్రామానికి వెళ్లి ఇరువర్గాలను సముదాయించారు. గ్రామంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

మూడో యూనిట్‌కు ముహూర్తమెప్పుడో!

- ఎస్టీపీపీలో 2015లో శంకుస్థాపన
- పనులు దక్కించుకున్న బీహెచ్ఈఎల్
- పదేళ్లయినా ప్రారంభంకాని పనులు
- ఉపాధి కోసం నిరుద్యోగుల నిరీక్షణ


కొత్త ప్లాంట్ నిర్మించనున్న ప్రాంతం

జైపూర్: పదేళ్లయినా మండల కేంద్రంలోని ఎస్టీపీపీలో మూడో యూనిట్ ప్లాంట్ నిర్మాణం టెండర్ల దశలోనే నిలిచింది. 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను విస్తరిస్తూ రెండు యూనిట్లకు అదనంగా మూడో యూనిట్ ఏర్పాటుకు 2015 మార్చిలో అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడున్న 600 మెగా థర్మల్ పవర్ ప్లాంట్ల ఎదుట మరో 600 మెగావాట్ల ప్లాంట్ నిర్మించాలని నిర్ణయించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కాలుష్య నియంత్రణలో భాగంగా సూపర్‌క్రిటికల్ విధానంతో 800 మెగావాట్ల ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు అనుమతించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నూతనంగా నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌కు అన్ని అనుమతులు పొందడానికి ఎనిమిదేళ్లు పట్టగా టెండర్లు ఖరారు కావడానికి మొత్తం 10 ఏళ్లు పట్టింది. రెండు దఫాలుగా సింగరేణి నిర్వహించిన టెండర్లలో రెండోసారి బీహెచ్ఈఎల్ కంపెనీ దక్కించుకోగా సుమారు రూ.8,500కోట్ల అంచనా వ్యయంతో కొత్త ప్లాంట్ నిర్మించనున్నారు. టెండర్ల దశకు చేరుకోవడానికి పదేళ్లు పట్టగా పనుల ప్రారంభోత్సవానికి ముహూర్తం కలిసి రావడం లేదు. ఓసారి ఉపముఖ్యమంత్రి ప్రోగ్రాం ఖరారై చివరి నిమిషంలో నేతల మధ్య వర్గపోరుతో రద్దయింది. ఉపముఖ్యమంత్రి పవర్ ప్లాంట్ సందర్శన, పలు ప్రారంభోత్సవాలు చేయాల్సి ఉండగా వాయిదా వేసుకుని వెళ్లిపోయారు. మళ్లీ సీఎం చేతుల మీదుగా కొత్త ప్లాంట్ ప్రారంభోత్సవం ఉంటుందని అందరూ భావించారు. గత నెలలో అధికార యంత్రాంగం సీఎం ప్రోగ్రాం ఉంటుందని హడావుడి చేసినా అది కూడా ఖరారు కాలేదు. అసలు కొత్త ప్లాంట్ ప్రారంభోత్సవానికి సమయమే కలిసిరావడం లేదని అభిప్రాయపడుతున్నారు. కాగా, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి ఇటీవల మంత్రి వర్గంలో చోటు దక్కింది. మంత్రి హోదాలో అతడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభిస్తారని అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆరు నెలలుగా కసరత్తు జరుగుతున్నా..

జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ద్వారా నిరంతరం విద్యుదుత్పత్తి చేస్తూ తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్ కాంతులు పంచుతోంది. సింగరేణి సంస్థకు ఇక్కడి వనరులు అనుకూలించడం ప్రధానంగా అంచనాకు మించి సేకరించిన భూములతో థర్మల్ విద్యుత్ కేంద్రాలను విస్తరించే దిశగా ఆదిలోనే అడుగులు వేసింది. అందులో భాగంగానే నూతనంగా మరో 800 మెగావాట్ల ప్లాంట్‌ను రూ.8,500కోట్ల అంచనాతో నిర్మించాలని నిర్ణయించింది. కానీ, నిధుల సమీకరణలో జాప్యం చోటు చేసుకుందో?.. లేదా ఆశించిన స్థాయిలో సింగరేణి సంస్థకు ప్రభుత్వ ప్రోత్సాహం లభించిందో.. లేదో కానీ 800 మెగావాట్ల ప్లాంట్ పనులు 10 ఏళ్లుగా టెండర్ల దశలోనే నిలిచాయి. ఎట్టకేలకు మళ్లీ బీహెచ్ఈఎల్ కంపెనీ పనులు దక్కించుకోగా పనుల ప్రారంభోత్సవానికి ఆరు నెలలుగా కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే పవర్‌ప్లాంట్‌లో కొత్త ప్లాంట్ నిర్మించే ప్రాంతాన్ని చదును చేసి అధికార యంత్రాంగం ఎదురుచూస్తోంది. రాజకీయ నేతల మధ్య సయోధ్య కుదరకపోవడంతో అధికారిక కార్యక్రమాలూ రద్దుకావడం అంతటా చర్చనీయాంశమైంది.

ఉపాధి కోసం యువత నిరీక్షణ

ఎస్టీపీపీలో కొత్తగా నిర్మించే 800 మెగావాట్ల ప్లాంట్ పూర్తయితే ఉద్యోగావకాశాలు మెండుగా లభిస్తాయని స్థానిక నిరుద్యోగ యువకులు, భూనిర్వాసితులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రెండేళ్లుగా కొత్త ప్లాంట్ ప్రారంభమవుతుందని అధికార యంత్రాంగం చెబుతున్నప్పటికీ దాని పనులు ప్రారంభం కాకపోవడంతో వారికి నిరాశే మిగులుతోంది. కొత్త ప్లాంట్ నిర్మాణంతో ప్రభావిత గ్రామాలతో పాటు పరిసరప్రాంతాల్లో ఇక నిరుద్యోగ సమస్య పూర్తిగా తీరుతుందని అందరూ భావిస్తున్నారు. అయినప్పటికీ ప్లాంట్ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుండడం గమనార్హం.

బస్టాండ్ బాత్రూంలో బోనోఫిక్స్ కలకలం!

- మత్తు కోసం వినియోగిస్తున్న యువత


బస్టాండ్ ఆవరణలో పడి ఉన్న బోనోఫిక్స్ కవర్లు

ఖానాపూర్: మద్యం, గుట్కాతో పాటు గంజాయి లాంటి పలు మత్తు పదార్థాలకు యువత బానిసలవుతున్న విషయం తెలిసిందే. కాగా, ఇదే తరహాలో సైకిల్ టైర్ పంక్చర్ కోసం వినియోగించే బోనోఫిక్స్‌తో ద్వారా మత్తును ఆస్వాదిస్తున్న ఘటన ఖానాపూర్ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్లు, మూత్రశాలల ప్రాంతంలో బోనోఫిక్స్ వినియోగించి పడేసిన ఖాళీ కవర్లు కనిపించాయి. ఈ ఘటన తెలియడంతో పట్టణవాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఒక్కసారిగా ఆందోళనకు గురవుతున్నారు. దుకాణాల్లో కొనుగోలు చేసిన బోనోఫిక్స్‌ను కర్చీఫ్‌లు, కవర్లలో వేసుకుని యువత మత్తు కోసం వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ వ్యవహారంపై అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తే మరిన్ని నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. బోనోఫిక్స్ పీల్చడం ద్వారా ఊపిరితిత్తులు చెడిపోవడంతో పాటు ఇతర వ్యాధులు వస్తాయని, సైడ్‌ఎఫెక్ట్‌లకు దారితీసే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బోనోఫిక్స్ విక్రయాలపై నిఘా పెట్టాలని, యువతకు దురలవాట్లపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో రౌడీయిం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందరమ్మ కాలనీకి చెందిన ఓ వ్యక్తిని భయభ్రాంతులకు గురి చేసి అతడి నుంచి రూ.2వేలు లాక్కున్న బంగారుగూడకు చెందిన షేక్ సలీంతో పాటు మరో ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవరైనా భయభ్రాంతులకు గురిచేసి రౌడీయిజం చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అనుమతి లేకుండా విత్తనాలు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీఐ ఫణిధర్, ఎస్సై విష్ణువర్ధన్ ఉన్నారు.

ఐఎన్టీయూసీతోనే సమస్యలు పరిష్కారం

మందమర్రిరూరల్: సింగరేణిలో కార్మిక సమస్యల పరిష్కారం ఐఎన్టీయూసీతోనే సాధ్యమని యూనియన్ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణిలో ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నేతృత్వంలో సంస్థ సీఎండీకి విన్నవించగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. సంస్థలో విధులు నిర్వహించే ఉన్నత చదువులు చదివినవారి కోసం ప్రత్యేకంగా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీని ఏర్పాటు చేయాలని కోరారు. కోర్టు కేసులను త్వరగా పరిష్కరించేందుకు యాజమాన్యం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమ్మయ్య వెంట యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు నరేందర్, సూర్యనారాయణ, వెంకటస్వామి, శంకర్‌రావు తదితరులున్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి జైలు

వాంకిడి: గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 10 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. 2021 జూలై 14న అప్పటి ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో ఖైరీట్ గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో కెరమెరి మండలం ధనోర గ్రామానికి చెందిన ఎండీ గులాబ్ ఖాన్, కాగజ్‌నగర్ మండలం చిన్నమాలిని గ్రామానికి చెందిన సూర్వం జిన్కు కారులో ఏడు కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. అప్పటి సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి వారిని రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుత సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్ సాక్షులను కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్ మోహన్‌రావు, ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ విచారణలో నేరం రుజువైంది. దీంతో నిందితులు గులాబ్‌ఖాన్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.60వేల జరిమానా, సూర్వం జిన్కుకు 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పీపీ జగన్‌మోహన్‌రావు, సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ రామ్‌సింగ్‌ను ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ అభినందించారు.

ఆటో బోల్తాపడి ఒకరి మృతి

- ఐదుగురికి గాయాలు


రొడ్డ ముత్యం మృతదేహం

ముధోల్: మండలంలోని బోరిగాం, వడ్తాల గ్రామాల మధ్య ఆటో బోల్తా పడ్డ ఘటనలో బ్రహ్మణ్‌గామ్‌కు చెందిన రొడ్డ ముత్యం (50) మృతి చెందగా, ఐదుగురికి గాయాలైనట్లు ఎస్సై పెర్సిస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బాసర మండలం కిర్గుల్(కే) గ్రామానికి చెందిన ఆటోలో మంగళవారం లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్ గ్రామానికి తమ బంధువు అంత్యక్రియలకు ముత్యం వెళ్లి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఆటో బోల్తా పడడంతో గాయాల పాలైనవారిని భైంసా ఏరియాస్పత్రికి తరలిస్తుండగా తీవ్రంగా గాయపడ్డ ముత్యం మార్గమధ్యలో మృతి చెందాడు. గాయపడ్డ వారిలో బాసర మండలం కిర్గుల్(కే) గ్రామానికి చెందిన బుజ్జవ్వ, కాశీ, ముధోల్ మండలంలో బ్రహ్మణ్‌గావ్ గ్రామానికి చెందిన లక్ష్మి, గంగన్న, రువ్వి గ్రామానికి చెందిన శ్యామల ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


హన్మాండ్లు (ఫైల్)

కుంటాల: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. కుంటాలకు చెందిన బాస హన్మాండ్లు (58) సోమవారం రాత్రి వర్షంలోనే నిత్యావసరాల కోసం కిరాణా దుకాణానికి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. తల వెనుక, ముందు భాగం బలమైన గాయాలయ్యాయి. అతడిని 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. అతడి కుమారుడు గజేందర్ బతుకుదెరువు కోసం ఏడాదిన్నర క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుకు మహిళ మృతి


నాగమ్మ (ఫైల్)

భీంపూర్: మండలంలోని నిపాని గ్రామానికి చెందిన కలిమి నాగమ్మ (48) మంగళవారం పిడుగుపాటుకు గురై మృతి చెందింది. వివరాలు.. నిపాని గ్రామానికి చెందిన నాగమ్మ అత్త కర్మకాండలో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీపూర్ గ్రామ సమీపంలోని చేను వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ఒక్కసారిగా వర్షం రావడంతో బస్టాండ్ వద్ద ఆగిన సమయంలో పిడుగు పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హమాలీవాడకు చెందిన తారాచాంద్ శర్మ భార్య అంకిత (40) ఈ నెల 7న ఉదయం కూరగాయలు తీసుకువచ్చేందుకు మార్కెట్‌కు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించారు. అయినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో తారాచాంద్‌శర్మ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు


వేమనపల్లి: ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయంటూ మండలంలోని కొత్తపల్లి గ్రామ రైతులు మంగళవారం తహసీల్దార్ సంధ్యారాణికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సెంటర్‌లో జరిగే అవకతవకల గురించి వివరించి ఆధారాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో పీఏసీఎస్ ద్వారా 19 లారీల వడ్లు కొనుగోలు చేసిన నిర్వాహకులు 15 రోజులైనా రైతులకు రశీదులు, ట్రక్‌షీట్‌లు ఇవ్వలేదని ఆరోపించారు. ఇలాంటివెన్నో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. విచారణ చేపడితే అక్రమాలు బయటపడతాయని తెలిపారు. అక్రమాలపై సెంటర్ నిర్వాహకులను ప్రశ్నిస్తే రైతులను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని, నిలదీస్తే బెదిరిస్తున్నారని ఆరోపించారు. బుధవారం కలెక్టర్‌ను కూడా కలిసి తమ గోడు విన్నవించుకుంటామని వారు తెలిపారు.

తేనెటీగల దాడిలో ఆరుగురికి గాయాలు


బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

తానూరు: మండలంలోని ఝరి(బి)తండా గ్రామ శివారులో మంగళవారం పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలపై ఒక్కసారిగా తేనెటీగలు దాడిచేయడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అస్వస్థతకు గురైన బాధితులను గ్రామస్తులు 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. తేనెటీగల దాడిలో రాథోడ్ గోవర్ధన్, హరిదాస్, సుభాష్, ధన్‌రాజ్, దేవుకబాయి, శివరాజ్‌కు గాయాలయ్యాయి. బాధితులు ప్రస్తుతం భైంసా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

జీసీసీ డీఎంగా పీహెచ్‌వోకు అదనపు బాధ్యత


సందీప్‌ను సన్మానిస్తున్న జీసీసీ సిబ్బంది

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) డివిజన్ మేనేజర్‌గా ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి (పీహెచ్‌వో) సందీప్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఎంగా పని చేసిన వీఎల్ఎన్ ప్రసాద్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లినందున తాత్కాలికంగా సందీప్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు త్వరలో తెరచుకోనున్న నేపథ్యంలో ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల సూచన మేరకు సందీప్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సందీప్‌ను జీసీసీ సిబ్బంది గోవింద్‌రావు, లింబారావు, సత్యనారాయణ తదితరులు సన్మానించారు.

మొక్కలు తొలగించి, చెట్లు నరికి నిరసన


మైసంపేట్‌లో మాట్లాడుతున్న భవానీశంకర్

కడెం: రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామస్తుల ఆందోళన రెండోరోజూ కొనసాగింది. మంగళవారం గ్రామస్తులు మరిన్ని గుడిసెలు వేసి అక్కడే వంట చేసుకుని మకాం వేశారు. ఉడుంపూర్ ఎఫ్ఆర్వో అనిత ఎదుటే రాంపూర్ గిరిజనులు ప్లాంటేషన్‌లో మొక్కలు తొలగించారు. చెట్లు నరికి నిరసన తెలిపారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఎఫ్‌డీవో భవానీశంకర్ ఇరు గ్రామాల గిరిజనులతో మాట్లాడినా వారు వినలేదు. తమ డిమాండ్లు నెరవేర్చేదాకా కదిలేది లేదని తేల్చిచెప్పారు.

మహిళా సమాఖ్యకే 'ట్రిపుల్‌ఐటీ యూనిఫాం'


యూనిఫాంలు పరిశీలిస్తున్న అభిలాష అభినవ్(ఫైల్)

నిర్మల్: రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ సేవలతో దూసుకుపోతున్న జిల్లా మహిళా సమాఖ్య మరో గుర్తింపును సొంతం చేసుకుంది. ఇప్పటికే స్కూల్ యూనిఫాంలను కుడుతున్న సమాఖ్య తాజాగా రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా గుర్తింపు ఉన్న బాసర ఆర్జీయూకేటీ విద్యార్థుల యూనిఫాంలనూ కుట్టించి ఇచ్చే పనిని దక్కించుకుంది. వేలాదిమంది విద్యార్థులుండే ట్రిపుల్‌ఐటీకి సంబంధించి రూ.54 లక్షల విలువైన యూనిఫాం కాంట్రాక్టు జిల్లా మహిళా సమాఖ్యకు దక్కడంపై డీఆర్డీవో విజయలక్ష్మి, సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గంగామణి హర్షం వ్యక్తంచేశారు. కలెక్టర్ అభిలాషఅభినవ్, ట్రిపుల్ ఐటీ వీసీ గోవర్ధన్ సహకారంతో మహిళా సమాఖ్యకు ఈ గుర్తింపు దక్కిందని పేర్కొన్నారు.

హాకీ చాంపియన్‌గా 'హైదరాబాద్'


చాంపియన్ జట్టుకు ట్రోఫీ ఇస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల విజేతగా హైదరాబాద్ జట్టు నిలిచింది. నిజామాబాద్ జట్టుతో జరిగిన పోరులో 3–0 గోల్స్‌తో విజయదుందుభి మోగించింది. రెండో స్థానంలో నిజామాబాద్, మూడో స్థానంలో నల్గొండ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాలో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌ను విజయవంతంగా పూర్తి చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్, జనరల్ సెక్రటరీ సీఆర్ భీంసింగ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, యూనుస్ అక్బాన్, రాష్ట్రపాల్, క్రీడాకారులు, శిక్షకులు పాల్గొన్నారు.

బ్లాక్ స్పాట్ల గుర్తింపు


గుడిపేట జాతీయ రహదారి వద్ద అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు మంగళవారం మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్, కమిషనరేట్ రోడ్డు భద్రతా విభాగం హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, ఆర్అండ్‌బీ ఏఈఈ రవికిరణ్, జాతీయ రహదారి జేఈ సతీశ్, పంచాయతీ రాజ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, రోడ్డు భద్రత కమిటీ సభ్యులు పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను సందర్శించారు. ముఖ్యంగా గ్రామాల రహదారులు జాతీయ రహదారిని సమన్వయం చేసే ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు గాను స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం, జాతీయ రహదారిపై రంబుల్ స్ట్రిప్స్ లైటింగ్ పెంచడం, సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం, అవసరమైన ప్రాంతాలతో పాటు వారసంతల వద్ద బారికేట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, బెల్లంపల్లి మండల కన్వీనర్ సీహెచ్ దేవదాస్ కోరారు. మంగళవారం బెల్లంపల్లి సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాయడానికి సిద్ధపడిందని విమర్శించారు. ఈ తీరు అత్యంత గర్హనీయమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెలో కార్మికులు సంపూర్ణంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి, శ్రేణులు పద్మ, అనురాధ, రాజేశ్వరి, స్వాతి, సీఐటీయూ శ్రేణులు యాకూబ్, సుమన్, నారాయణ, రవీందర్, విశ్వనాథ్, అనిల్, రాహుల్, కిశోర్ పాల్గొన్నారు.